క్లుప్తంగా

శ్రీరామనవమికి ఏర్పాట్లు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయం, రైల్వే కాలనీలోని కోదండ రామాలయం, మండలంలోని భూపాలపట్నం, లోనవెల్లి గ్రామంలోని రామాలయాల్లో ఆదివారం నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు ఆలయాల కమిటీ, గ్రామ ప్రజలు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సీతారాముల కల్యాణం, అన్నదాన ప్రసాదాల పంపిణీ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి అప్పగిస్తున్న ఎస్సై

దహెగాం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన సిద్దం నర్సయ్య అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫోన్ పోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి శనివారం అప్పగించినట్లు పేర్కొన్నారు.

వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి: వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేయాలని ప్లాంటేషన్ మేనేజర్ ఆంజనేయులు, ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని గోండ్‌గూడ(ఇందాపూర్) గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన 2.0 వాటర్ షెడ్ పథకంలో భాగంగా భూమి, నీటి సంరక్షణ కోసం వర్షం నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్, ఏఈ విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



మహిళలతో సంస్థ ప్రతినిధులు

తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్ పరిధిలోని అరటిపల్లి గ్రామంలో జౌట్ రిచ్ మ్యాప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కెరోలిన్ విగ్ మాట్లాడుతూ 22 మంది మహిళలకు ఐదు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 13 మంది మహిళలకు 50 శాతం సబ్సిడీతో మిషిన్లు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రమోద్, లింగు, మోతిరాం, సుశీల పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులు బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

దహెగాం: గత సంవత్సరం నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డి మందు విక్రయించి పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను శనివారం స్థానిక తహసీల్దార్ కవిత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని గొర్రెగుట్ట గ్రామానికి చెందిన షేక్ జమీర్, భీమిని మండలంలోని కర్జి భీంపూర్ గ్రామానికి చెందిన వడ్డె సుధాకర్, వడ్డె నాందేవ్‌లను బైండోవర్ చేశామన్నారు. మరోసారి నకిలీ విత్తనాలు విక్రయిస్తే రూ. 2 లక్షలు జరిమానా విధిస్తామన్నారు.

మొబైల్ షాపులో చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండల కేంద్రంలోని శివమ్ మొబైల్ షాపులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడినట్లు రెబ్బెన చంద్రశేఖర్ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బండారి రాకేశ్ అనే వ్యక్తి రెబ్బెన మండల కేంద్రంలో శివమ్ మొబైల్ షాపు నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి 7.30 గంటలకు షాపు మూసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం షా పు పక్కనే ఉన్న నారాయణ అనే అతను రాకేశ్‌కు ఫోన్ చేసి నీ మొబైల్ షాపు వెనుక వైపు ఉన్న తలుపులు తెరిచి ఉన్నాయని తెలపడంతో హుటా హుటిన షాపుకు వచ్చి పరిశీలించాడు. ఎస్సై చంద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొక్కలకు నిప్పు..!

- చెట్లపొదలకు నిప్పు పెడుతున్న రైతులు
- కాలిపోతున్న ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు



నిప్పు పెట్టడంతో ఎండిపోయిన ప్లాంటేషన్ మొక్కలు

వాంకిడి: ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అవగాహన లోపంతో కాలిపోతున్నాయి. నాగరికత పెరుగుతున్న కొద్ది వాతావరణంలో వస్తున్న మార్పులను అదుపులోకి ఉంచాలంటే మొక్కల పెంపకం చాలా అవసరం ఉంటుంది. అభివృద్ధి పేరిట ఇప్పటికే కొన్ని లక్షల చెట్లు, వృక్షాలను తొలగిస్తున్నారు. వాటిస్థానంలో రెట్టింపు స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షల మొక్కల పెంపకం చేపడుతుంది. వనాలు, రహదారులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్, పార్కులలో మొక్కలు విరివిగా పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది.

నిప్పు పెట్టేస్తున్నారు..

వాంకిడి నుంచి జంబుల్‌ధరి వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలకు అవగాహన లోపంతో రైతులు నిప్పు పెట్టేస్తున్నారు. రహదారులకు ఆనుకుని పొలాలు ఉన్న వారు పొదలను తొలగించకుండా నేరుగా నిప్పు పెట్టేస్తున్నారు. ఇందులో అధికారుల నిర్లక్ష్యం కూడా కనిపిస్తుంది. రహదారి వెంట ముళ్ల పొదలు కమ్మేసినా తొలగించకుండా ఉండిపోతున్నారు. రైతులు పొలం పనులు ముగిశాక పత్తి కట్టె కాల్చే సమయంలో మొక్కలు కూడా కాలిపోతున్నాయి. ప్రభుత్వ లక్ష్యంపై ప్రజల్లో అవగాహన లేకపోవడం ఇందుకు కారణంగా చెప్పవచ్చు. గత ప్రభుత్వం ప్రతీ గ్రామానికి పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేయించి లక్షల మొక్కలను పెంచేలా చర్యలు తీసుకుంది. కానీ ఆ మొక్కల్లోని కొన్ని పశువుల పాలు కాగా మరి కొన్ని నీళ్ల లేక ఎండిపోతున్నాయి.

రూ.లక్షలతో నర్సరీల నిర్వహణ..

గ్రామాలు పచ్చదనంతో ఫరిడవిల్లేలా ప్రతీ గ్రామ పంచాయతికీ ఒకటి చొప్పున నర్సరీని నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఒక్కొక్క జీపీలో వేల మొక్కలను పెంచుతున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఒక్కొక్క నర్సరీ నిర్వాహణకు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఖర్చు చేస్తున్నారు. గత రెండేళ్ల నుంచి మండల వ్యాప్తంగా నర్సరీలలో సిద్ధం చేస్తున్న మొక్కల వివరాలు చూసుకున్నట్లైతే 2023లో 3.50 లక్షలు, 2024లో 3.50 లక్షలు, 2025లో 3.38 లక్షల మొక్కలను వర్షాకాలం ప్రారంభంలో నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. నర్సరీల నిర్వాహణకు మండల వ్యాప్తంగా దాదాపుగా ప్రతీ సంవత్సరం రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలుస్తుంది. జనహితం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం



చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ భక్తులు శనివారం సామూహిక అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ సంకల్ప పూజలు చేసి ప్రారంభించారు. కేస్లాపూర్ ఆలయంలో జరుగుతున్న భక్తి కార్యక్రమాల్లో భాగంగా హనుమాన్ చాలీసా పారాయణాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ధర్మపురి వెంకటేశ్వర్లు, పిన్నా వివేక్, రాధాకృష్ణచారి, ప్రవీణ్, బాలేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో శనివారం భక్తులు సీతారాముల పల్లకిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ప్రతీఏటా శ్రీరామనవమి సందర్భంగా మహారాష్ట్రలోని చప్రాడ కార్తీక్ ఆలయం నుంచి బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల మండలాల మీదుగా ఊరేగిస్తారు. శనివారం మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట్ గ్రామాలకు పల్లకి చేరుకోగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నేడు పల్లకి తుమ్మిడిహెట్టి గ్రామానికి చేరుకుంటుందన్నారు. శ్రీరామనవమి సందర్భంగా తుమ్మిడిహెట్టిలోని ప్రాణహిత నది ఒడ్డున గల శ్రీకార్తీక్ మహరాజ్ ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోషకాహార దినోత్సవం



మాట్లాడుతున్న వైద్యుడు వినయ్ ఉప్రె

వాంకిడి: మండలంలోని అర్లి గ్రామంలో శనివారం మండల మెడికల్ ఆఫీసర్ వినయ్ ఉప్రె ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య పోషకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పూర్వ స్నేహం, నవజాత శివువుల ఆరోగ్యం, సంరక్షణ, పోషకాహార పదార్థాల వాడకం, పోషణ విలువలపై అవగాహన కల్పించారు. పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

క్రీడలతో స్నేహభావం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన వడూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్–3 ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యువకులు, క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులకు టీషర్టులు అందజేసేందుకు ముందుకు వచ్చిన పాల రాజేశ్వర్, ఆదుముల్ల రాములు, అలూరి నవీన్, ద్యావంత్ సుమన్, పాల సుధీర్ కుమార్, ఆడెపు శ్రీకాంత్‌లను అభినందించారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో శనివారం పర్యటించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రీకాంత్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్ర



మాట్లాడుతున్న ఆడే గజేందర్

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో శనివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడారు. దేశంలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుంర సత్యవతి కోటేశ్, క్లాం నారాయణ్‌రెడ్డి, ముస్తాఫా, కొత్తురు లక్ష్మణ్, ఆసిఫ్‌ఖాన్, చోలే ప్రభాకర్, ప్రవీణ్‌రెడి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

నేరడిగొండ: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని యాపల్‌గూడ నుంచి ఇస్రుగూడ వరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడే వసంత్‌రావు ఆధ్వర్యంలో శనివారం పాదయాత్రగా వెళ్లారు. జై బాపూజీ.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అందరం కలిసి పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్‌రావు, తిత్రే నారాయణ సింగ్, అర్క యాదవ్, భీంరావు పటేల్, సీతారాం, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

'సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే'



గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

తలమడుగు: దేశంలో పేద ప్రజలకు సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖప్పర్ దేవి పరిధిలోని ఇందిరానగర్‌లో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. పేదల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బాబన్న, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, వెంకన్న యాదవ్, చెన్నాల సాయి కుమార్, లోక ప్రవీణ్ రెడ్డి, జయరాం పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయొద్దు



తాగునీటి బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నార్నూర్: నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో జవహర్‌లాల్ అన్నారు. శనివారం మండలంలోని జామ్‌డా గ్రామ పంచాయతీ పరిదిలోని పూసిగూడలో పర్యటించారు. తాగునీటి బావి, చేతి పంపులను పరిశీలించారు. ఎండ అధికంగా ఉండడంతో గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయన్నారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు రెండు రోజుల్లో పైపులైన్ కలెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేస్తామన్నారు. ఎక్కడ నీటి సమస్య లేకుండా జాగ్రత్తు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ గంగాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



ఆసిఫాబాద్అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: మహనీయుల ఆశయం రాజ్యాధికారమేనని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రావ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రేగుంట మహేశ్, రాంచందర్, రవి, నరసయ్య, ప్రభాకర్, సంతోష్, మల్లేష్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మంత్రిగా ఆయన ఎన్నో పదవులను అధిరోహించిన నాయకుడన్నారు.

కౌటాల: బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద బాబు జగ్జీవన్‌రాం 118 జయంతి నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల మేలు కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడ్ల తిరుపతి, గణపతి, శ్రీనివాస్, అశోక్, శివాజీ, దేవయ్య, నందారం,సిబ్బంది లాలాజీ, బానయ్య పాల్గొన్నారు.

రెబ్బెన: బాబు జగ్జీవన్‌రాం జయంతిని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దార్ రామ్మోహన్‌రావు, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వివక్షతకు, సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా బాబు జగ్జీవన్‌రామ్ కృషి చేశారని గుర్తుచేశారు. ఆర్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది సతీష్, రమేశ్ పాల్గొన్నారు.



రెబ్బెన: పూలమాల వేస్తున్న తహసీల్దార్



కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు



కౌటాల: ఎంఈఓ కార్యాలయం వద్ద..

రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్: కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శుక్రవారం రాత్రి ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. సర్వే పూర్తయిన ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ ప్రాజెక్టును మంజూరు చేయాలన్నారు. అదే విధంగా ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని బాసర, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్లలో మరిన్ని రైలు సర్వీసులను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఉన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

తలమడుగు: కృషి, పట్టుదలతో యువత అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని పూలాజీ బాబా ధ్యాన కమిటీ అధ్యక్షుడు, కాటిపెల్లి సురేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్ అన్నారు. శనివారం తలమడుగు గ్రామానికి చెందిన కె.దినేష్‌రెడ్డి బ్యాంకులో ఉద్యోగం సాధించడంతో ఆయన ను పూలాజీ బాబా ధ్యాన కమిటీ సభ్యులు ఘ నంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, కాటిపల్లి సునీత రెడ్డి, కాటిపల్లి రాధమ్మ, అనిత రెడ్డి, రవితరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని తుంపల్లి గ్రామ సమీపంలో మధ్యాహ్నం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న జంగుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇల్లు మంజూరు చే యాలని ఆదిలాబాద్ పట్టణంలోని సర్వే నెంబ ర్ 170లో ఇంటి స్థలాలు కలిగినటువంటి పేదలు కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడ నివాసం ఉండేందుకు వీలుగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ కనెక్షన్లను అందించాలన్నారు. నీటి సరఫరా వ సతితో పాటు పారిశుద్యం, రోడ్డు వంటి సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లుగా వెల్లడించారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో కనర్‌గాం ఎక్స్‌రోడ్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇటీవల రహదారి పనులు చేపట్టడంతో మొరం, కంకరతో రోడ్డు ఎత్తు పెరిగింది. దీంతో స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం భూమి నుంచి మూడు ఫీట్ల ఎత్తులో ఉంది. మూగజీవాలకు, చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది.

అధికారి పేరు: శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ, వాంకిడి
సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 94910 58641